# సంపద సృష్టికి పీఎంఎస్



వేణుగోపాల్ జాగర్లమూడి
సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్, జెన్‌మనీ

సాధారణంగా స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేయాలని ఆసక్తి ఉన్నా.. చాలా మంది ఇన్వెస్టర్లకు వాటిపై సరైన అవగాహన లేకపోవడం లేదా తెలుసుకునేంత తీరికా ఉండవు. ప్రస్తుతం అనేక ఇన్వెస్ట్‌మెంట్ సాధనాలు అందుబాటులో ఉన్నప్పుడు.. వాటిలో ఇన్వెస్ట్ చేయాలంటే కాస్తో, కూస్తో అవగాహన పెంచుకోక తప్పదు. ఇందుకోసం సమయం వెచ్చించగలిగే వారు తమ పోర్ట్‌ఫోలియోను సొంతంగా పర్యవేక్షించుకోగలరు. కానీ, ఇన్వెస్ట్ చేయడానికి భారీగా నిధులున్నా.. పూర్తి స్థాయిలో దృష్టి పెట్టేందుకు అవకాశం లేని వారు మ్యూచువల్ ఫండ్స్ లేదా పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (పీఎంఎస్)ల సాయం తీసుకుంటున్నారు. ఈ రెండింటిలోనూ ఫండ్ మేనేజర్లు మీ తరఫున మీ ఇన్వెస్ట్‌మెంట్స్ లెక్కలను చూసినా.. రెండింటి మధ్య కొన్ని వ్యత్యాసాలు ఉంటాయి. ఉదాహరణకు మ్యూచువల్ ఫండ్స్ లో వివిధ వ్యక్తులు ఇన్వెస్ట్ చేసే చిన్న మొత్తాలన్నింటినీ ఒక్క దగ్గరకు చేర్చి ఫండ్ మేనేజర్ ఏకమొత్తంగా ఇన్వెస్ట్ చేస్తారు. అలా కాకుండా మీ దగ్గర భారీ స్థాయిలో నిధులు ఉండి.. ఇన్వెస్ట్‌మెంట్స్‌పై మేనేజర్ మరింత ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరుకుంటున్న పక్షంలో పీఎంఎస్ అనువైన మార్గం.

పీఎంఎస్ అనేది ప్రొఫెషనల్ పోర్ట్‌ఫోలియో మేనేజర్



ఆధ్వర్యంలో స్టాక్స్, ఫిక్స్‌డ్ ఇన్‌కం, డెట్, క్యాష్ వంటి సాధనాల్లో పెట్టే పెట్టుబడుల పోర్ట్‌ఫోలియో. ఈ సర్వీసుల్లో ప్రతి క్లయింటు పోర్ట్‌ఫోలియోపైనా మేనేజరు వ్యక్తిగత శ్రద్ధ తీసుకుంటారు. క్లయింటు లక్ష్యాలకు తగ్గట్లుగా పోర్ట్‌ఫోలియోను తీర్చిదిద్దటం, పర్యవేక్షించడం జరుగుతుంది. ప్రస్తుతం చాలా బ్రోకరేజి సంస్థలు పీఎంఎస్‌ల్లో కనీస పెట్టుబడి పరిమితిని రూ. 25 లక్షల నుంచి రూ. 1 కోటి దాకా ఉంచాయి.

## రెండు రకాలు..

ఈ సర్వీసులు.. డిస్క్రిషనరీ పీఎంఎస్, నాన్-డిస్క్రిషనరీ పీఎంఎస్ అని రెండు రకాలుగా ఉంటాయి. మొదటి తరహాలో క్లయింట్ అవసరాలకు తగ్గట్లుగా పోర్ట్‌ఫోలియోను ఎలా తీర్చిదిద్దాలన్నది పోర్ట్‌ఫోలియో మేనేజర్ సొంతంగా నిర్ణయాలు తీసుకుంటారు. అదే రెండో రకంలోనైతే క్లయింటు సూచనల ప్రకారం మేనేజర్ వ్యవహరిస్తారు. పోర్ట్‌ఫోలియో నిర్వహణ బాధ్యతలను చేపట్టే ముందు సదరు మేనేజరు, క్లయింటుతో ఒక ఒప్పందం కుదుర్చుకుంటారు. ఇందులో నిబంధనలు చాలా మటుకు సెబీ నిర్దేశించినవే ఉన్నా.. మరి కొన్ని అంశాలను ఆయా సంస్థలు స్వయంగా జోడించే అవకాశముంది. కాబట్టి.. ఒప్పందంపై సంతకం చేసే ముందు వివరాలన్నీ చదువుకుని, తెలుసుకోవడం మంచిది.

## ఫీజులు..

పీఎంఎస్‌ల ఫీజుల విధానం ఫండ్స్‌కి భిన్నంగా ఉంటుంది. ఫండ్స్‌లో దాని పనితీరు ఎలా ఉన్నా మీ ఇన్వెస్ట్‌మెంట్‌పై ఏడాదికి ఇంత శాతమంటూ ఫీజులు చెల్లించాలి. అదే పీఎంఎస్ విషయానికొస్తే.. ఫీజులో రెండు భాగాలు ఉంటాయి. ఒకటి మీ ఇన్వెస్ట్‌మెంట్‌పై ఏడాదికి ఇంత శాతమంటూ ఒక భాగం కాగా.. పని తీరును బట్టి చెల్లించేది మరో భాగం. ఫీజులో ఈ రెండింటిలో ఏదైనా ఒకటే కూడా ఉండొచ్చు లేదా రెండూ కలిసి కూడా ఉండొచ్చు. పనితీరు ఆధారిత భాగమనేది.. మీకొచ్చిన లాభాల్లో కొంత శాతంగా ఉంటుంది. పోర్ట్‌ఫోలియో మేనేజర్లు క్లయింట్ల పెట్టుబడులకు నిర్దిష్ట లాకిన్ వ్యవధి నిర్దేశించడానికి అవకాశం లేదు. అయితే, క్లయింటు నిర్దేశిత వ్యవధి కన్నా ముందుగానే వైదొలిగే పక్షంలో ఎగ్జిట్ ఫీజు వసూలు చేయొచ్చు.

పీఎంఎస్‌లో ఇన్వెస్టర్ల కోసం ప్రత్యేకంగా ఓ పోర్ట్‌ఫోలియో మేనేజరు లభిస్తారు. ఒక రకంగా పీఎంఎస్ అనేది మీ ఇన్వెస్ట్‌మెంట్స్‌కి ఓ ఫ్యామిలీ డాక్టర్‌ను తీసుకోవడం వంటిది.